కథానిక :

# సంఘసేవ!

★

శ్రీ క్రొవ్విడి లక్ష్మన్న

## 1

రెండేళ్ల క్రితం. సరిగ్గా పండుగ రోజుల్లో నేను ఏదో పనిమీద భీమునిపట్నం వెళ్ళి, మా కామాక్షత్తయ్యగారింట్లో దిగాను. నిజానికి ఆవిడ నాకు మేనత్తా కాదు, ఏమీ కాదు. మా నాన్నగారూ ఆవిడ భర్తా ఒకే కంపెనీలో ఉద్యోగం చేసేవారు కలకత్తాలోను. కొన్నేళ్లపాటు ఒకేయింట్లో చెరోవాటా చేసుకుని ఉండేవారు. ఆ తరవాత ఆయన ఏదో వ్యాపారంలోకి దిగిపోయాడు. అవి నాకు బొత్తిగా చిన్నతనపు రోజులు. వాళ్ల పిల్లలతో ఆడుకుంటూ ఉండేవాణ్ణి. అసలు పిల్లలంతా వాళ్లింట్లోనో, మాయింట్లోనో ఏకమొత్తంగా ఉండేవాళ్లం, కాని యెవరియింట్లో వాళ్ళు ఉండడం అనే ఆనవాయితు ఎప్పుడూ లేదు. అదుగో, ఆ రోజులనుంచీ చనువు, నాకూ ఆ కుటుంబానికిన్నీ, ఆవిణ్ణి కామాక్షత్తయ్య అనీ, ఆమె భర్తని సుందరం మాఁవయ్యనీ, కూతుర్ని "బాజీ" అని—బాజాలాగ వాగుతూనే ఉండేదిలెండి—పిలిచేవాణ్ణి. ఈ వరసలకి అర్థం పర్థం లేకపోయినా, నాటికీ నేటికీ పరస్పరంగా మా రెండు కుటుంబాలలోనూ ఆత్మీయతా అభిమానమూ మాత్రం అలా అంటిపెట్టుకుని ఉండిపోయాయి. ఇప్పుడు నేనుబాగా పెరిగి పెద్దవాణ్ణయినా ఆ అనుభవం మాత్రం సడలలేదు. "బాజీ" యీ మధ్య నీళ్ళాడిందనీ, యింకా తల్లిదగ్గిరే ఉందనీ తెలిసింది. సరే, నలుగుర్నీ చూడవొచ్చును, పనీ చూసుకోవొచ్చును అనుకుని మా కామాక్షత్తయ్యగారింటికి వెళ్లాను, మరి.

ఇల్లు చేరుకునేసరికి భోజనాలవేళ అయింది. విస్తరిముందు కూచుంటూ ఉంటే కాకి అరిచింది.

"ఇంకెవరు మిగిలిపోయారమ్మా, అలా గొంతుక చించుకుంటున్నావ్? ఇప్పుడుగానీ యెవరయినా దిగడితే, మళ్లీ అత్తిసరు పెట్టాలి." పిల్లల తల్లిఅయినా బాజీబాజీయే! అంతలో "అమ్మమ్మా, పాపారావు తాతయ్య వొచ్చేడే" అంటూ మనవడు సావిట్లోంచి ప్రకటన చెయ్యనే చేసేడు. బాజీ ఏఁవిటో పట్టరాని ఉత్సాహంతో ముందు వాకిట్లోకి పరిగెత్తింది. 'ఎవరూ' అన్నట్టు, చేతులో పప్పుపిడచ బచ్చలకూర పులుసులో ముంచుతూనే, మొహం పైకెత్తిచూశాను.

"పాపారావుగారనీ—మనవాళ్లే—మీ మాఁవయ్యగారూ ఆయనా కలిసి చదువుకున్నారుట. చిన్నప్పట్నుంచీ స్నేహితులు. అతనుకూడా పాపం, చాలా మంచివాడు, నెమ్మదయినవాడున్నూ ......పాపారావు బాబయ్య సంగతే అంటున్నానూ." ఈ చివరిమాట బాజీతో అంది కామాక్షత్త.

"అమ్మా, పాపారావు బాబయ్య బొత్తిగా చిక్కిపోయాడే యీమాటూ." అంది బాజీ.

"అత నెప్పుడూ అంతే నే. అయినా, లోకంలో యిబ్బందులన్నీ తనవే అని నెత్తినవేసుకుంటాడు. పుణ్యఁవే కాని—"

"మరేం. అసలు యిప్పు డెక్కడో బొత్తిగా పల్లెటూళ్లో ఉంటున్నాట్ట."

"మొదట్నుంచీ అతని ధోరణే అంత. మహా మెత్తని మనస్సు, పాపం. తనకికూడా చూసుకోకుండా బీదకీ బిక్కికీ అలా యిచ్చేస్తూ ఉంటాట్ట, చేతులో యేది ఉంటే అది. మళ్ళీ పైకి పిసరంత తొణకడు సుమ. అలాగ నిమ్మకి నీరెత్తినట్టుంటాడు, వెర్రిబాగుల వాడిలాగ."

"నాకు యిప్పట్లో జ్ఞాపకఁవేఅమ్మా. చిన్నప్పుడు యెన్ని పటాకీలు కట్టియిచ్చేవాడనీ? దీపావళి ఇంకా నెల్లాళ్ళుందనగా ఆరంభించి అది కట్టడం కాదు! పెద్ద అయింతరవాత పాఠాలూ అలాగే చెప్పేవాడమ్మా. అన్నయ్యా అనేవాడు కాదూ, కాలేజీమేష్టర్లకంటే బాబయ్య ఎంతో బాగా చెబుతాడనీ?...ఏవో వ్యాసాలూ ఆవీకూడా రాస్తూఉండేవాడుకదు టే?"

"అన్నీ చేతనవునే అతనికీ. సరస్వతీపీఠం. కానయితే యేంగ్రహచారవో కాని మీ నాన్నగారు పోయినదగ్గిర్నుంచీ అతనికి మతిపోయింది. ఏవిటో "లోకం, మూర్ఖం" అంటూ యిందులో పడిపోయేడు మరి."

"రెండేళ్లు అయింది కదమ్మా. పాపారావు బాబయ్య కంటపడీ?"

"అయిందికాదూ? మీ నాన్నగారు మంచం పట్టినప్పుడు వొచ్చాడు. పోరుగేగా. అంతే. తరవాత ఆయన కన్ను మూశాక, ఆ నాలుగు దినవారాలూ జరిపించి, తను మకాం యెత్తేశాడు. మరి ఫికరే లేదు. నాటికి నేడూ, మళ్లీని! దుఃఖం భరించలేకనే దూరంగా పోయాడే, పాపం. అన్నదమ్ముల్లాగ ఉండేవారాయె!"

## 2

తల్లిమాటలు వింటూనే బాజీ నాపక్కన యింకో వెండికంచం, పీటా వేసి నీళ్లూ అవీ పెట్టింది. వొడ్డిస్తూ ఉంటే, పాపారావుగారు స్నానం ముగించుకుని వొచ్చాడు. పరిచయాలయాయి. స్పీడు కాస్తతగ్గించి, మళ్ళీ ఒక్క అయిటెం వెనక్కి వొచ్చి సావకాశంగా తిరిగీ ఉపక్రమించాను, నాభోజనం, ఆయనతో కబుర్లు చెబుతూను. అన్నానేకాని, కబుర్లన్నీ బాజీయే చెబుతోంది ఆయనతోను.

"జైనూ, బాబాయ్, యీ శీతాకాలంలో మావూరు రారాదూ? సర్కస్సులూ, కార్నివాల్సూ అవీ రెండుకళ్లు చాలవు, చూడ్డానికి. క్రిస్‌మస్‌లో నాలుగురోజులుండి వెళుదువుగాని. ఏం? మావారు కూడా చాలా సంతోషిస్తారు. ఆయన్ని చూడనే లేదుగా, నువ్వూ?"

"అలాగేనమ్మా, వొస్తాన్లే" ఏదో బరువుగా, నిరుత్సాహంగా అనేశాడు, పాపారావుగారు— ఆవిషయం మాట్లాడకుంటే బావుణ్ణు అన్నట్టు.

"వొస్తాన్లే అంటేకాదు. తప్పకుండా రావాలి"

"ఇంతకన్నా ఆప్యాయంగా పిలిచి ఆదరించే వాళ్లు యెవరు బాజీ, నాకూ? కాని, వెధవది ఏదో ఒహటి అలా తింటసంలాగ అడ్డు తగులుతూనే ఉంటుంది. అసలు యెన్నిసార్లు వొద్దాం అని ప్రయత్నించినా ఎప్పటికప్పుడే ఏదో యిదయిపోతూనే వొస్తోంది మరి." ఆ బ్రాహ్మడు ఏదో నూతులోంచి మాట్లాడుతూన్నట్టు అనిపించింది నాకు. ఏదో నాలిక చివరిదాకా వొచ్చి ఆమాట చెప్పకుండా అవతల వాళ్ల మనస్సు నొప్పించకుండా ఊః తికమకలు పడిపోతున్నాడు.

"ఇన్నాళ్ళూ ఏవో అయిపోయిందిలెద్దూ" బాజీ వొత్తిడిచేసింది.

"ఇప్పుడయినా కంటపడ్డావు కనకా. కాక పోయినా బొత్తిగా ఆ పల్లెకొంపల్లో ఆలనా, పాలనా సంరక్షణా? ప్రజలకి ఏదో చేద్దాం అని నువ్వు పడుతూన్న శ్రమా అదీ చాలా మంచిదేకాని, నువ్వు దృఢంగా ఉంటే మాటకదూ మిగతావన్నీనూ?"

"నిజంవే, బాజీ, నిజంవే. 'స్వయంతీర్ణః పరాం స్తారయేత్' అన్నారు. నేను మొదట ఆరోగ్యంగా ఉండాలే అనుకో—"

"మరి నీకు ఏంవయినా విశ్రాంతి అనేది దొరుకుతోందీ? అందులోనూ ఈ వయస్సులో, అ పల్లెటూళ్లో ధూళీ దుమ్మూ—"

"అలాగ కొట్టిపారెయ్యకు, బాజీ. పల్లెటూరి గాలీ నీరూ యెంత ప్రశస్తంగా ఉంటాయనీ?"

మొత్తానికి విషయం తేల్చకుండా, ఏవో "సంఘం" పనులూ అవీ ఉన్నాయి అంటూ భోజనం ముగించాడు పాపారావుగారు. సావిట్లో బల్ల మంచం మీద కాస్సేపు నడుంవాల్చి సాయంత్రం ప్రయాణం అయి వెళ్ళిపోయాడు. కోరా ఖద్దరు లాల్చీ నీర్కావి రంగుపంచేనూ ఆయన కట్టుకున్నవి. పై మీద అన్ని అవసరాలకీ ఆదుకునే ఓ తువ్వాలు! అలాంటిదే ఒక సజ్జు చేతిసంచీలో ఉంది. అది చేతపుచ్చుకుని బయలుదేరాడు పాపారావుగారు. దగ్గిరున్న బస్సు స్టాండుకి కాదు; అంతకన్నా దగ్గిరలో దొరికే జట్కాకోసంవూ కాదు. అలాగ సాయంత్రపు నీరెండలో జభరుగా అడుగులు వేసుకుంటూపోయాడు, క్రోసున్నర పోతేనేగాని అవుపడని చిట్టివలస!

తను స్వర్గతుల్యం అని చెప్పి వర్ణించిన ఆ పల్లెటూరు చేరుకునేసరికి బాగా చీకటి కమ్ముకుంది. కొట్టుగది గుమ్మం తెరుస్తూనే అగ్గిపుల్ల అరగదీసి ఓ గుడ్డి బ్రెడూంలైటు వెలిగించాడు. లాల్చీవిప్పి, పంచె ఎగగట్టి, కాళ్ళూ మొహం కడుక్కుని కడుపునిండా గ్లాసుడు నీళ్ళు తాగాడు. అంతలో కళ్ళు మూతలు పడ్డాయి. చాపమీద జంబుఖాళం పరుచుకుని ఒళ్లు మరిచి నిద్దరపోయాడు. ఉదయాన్ని లేస్తూనే కొట్టు తుడుచుకుని, ఏటినుంచి నీళ్లు మోసుకువొచ్చి మండీ

మండని పచ్చికర్రలతో చెయ్యి కాల్చుకున్నాడు—చేసింది పెసరకట్టూ, అన్నమున్నూ. పొరుగువాళ్ళు యిచ్చిన చల్లముక్కతో సహా మూతి తుడుచుకుని ఆదరాబాదరాగా మిల్లుకి వెళ్ళిపోయేడు.

## 3

ఆఖరుకి ఆయనగీత అలా మారిపోయింది. ఒకానొకప్పుడు తనూ నాలుగువేళ్లూ నోట్లోకి పోతూ ఉన్నవాడే. కాస్త భూమీ పుట్రా, యిల్లూ వాకిలీ ఉండేవి తనకీని! విజయనగరంలోనే బి. ఏ. ప్యాసయ్యాడు. తరవాత ఉద్యోగాల తర్జన భర్జనలోపడి, ఆ ఆలోచన తెమిలేవేళకి నాలుగోపడి పైపడగా, యిహనా చింత విరమించుకున్నాడు—ఉన్నది నిలబెట్టుకుంటె చాలదాయేఁవిటి యీ జానెడు పొట్టకీని అనుకొని. చదువుకున్నవాడూ సౌమ్యుడూ అవడం మూలాన్ని సొసయిటీలో పదిమందితోనూ పరిచయం ఉండేది. పక్కనే ఉన్న సుందర్రావు మాఁవయ్య అయితే కేవలం తన యింటిమనిషిలాగే చూసుకునేవాడు. రోజులు నెమ్మదిగా హాయిగా గడిచిపోతూ ఉండేవి. అంతలో సుందర్రావు మాఁవయ్య "స్టాక్ ఎక్స్ఛేంజి"లో తల దూర్చాడు. పాపారావుగారు అతనికి ఆసరాగా నిలుచున్నారు. అప్పులుచేసి మదుపులు పెట్టినా లాభించినన్నాళ్ళు బాగానే లాభించింది మొదట్లోను. కాని ఉండి ఉండి ఓనాడుమాత్రం మరి లేవకుండా నడ్డి విరిచేసింది. తన కళ్లముందే—చూస్తూఉండగానే—యిల్లు గుల్లఅయిపోవడం పాపారావుగారు గమనించారు. ఇహ నేమాత్రం అశ్రద్ధ చేసినా అప్పులు ఎగగొట్టాడన్న అప్రతిష్ఠ పాలు కావలసి వస్తుంది. అటు సుందరం మావయ్యకూడా యించుమించు అదేస్థితిలో ఉన్నాడు. ఎటొచ్చీ, కాస్త గుడ్డిలో మెల్ల. కొంత ఆస్తి అప్పటికప్పుడే భార్యాపిల్లలపేర రాసేశాడు.

పాపారావుగారికి ఏనాడో కళత్ర నష్టం సంభవించింది. అప్పట్నించీ ఆయన అలాగే ఉండిపోయాడు. ఇంక యిరస్తా పరస్తా యెవ్వరూ లేరు; కనక నే-ఏమాటకి ఆమాటే అనుకోవాలి మరి—సుందరం మాఁవయ్య ప్లాన్లకి తను చేతికి ఎముక లేకుండా సాయపడుతూ ఉండేవాడు. అయితే, సుందరం మాఁవయ్యమట్టుకు తలపెట్టే కీడు చేసేడా? గ్రహచారం కాకపోతేను! ఇంతకూ కాలం, కర్మం అలా సమకూడాయి. లెక్కలు సరిచూసుకోవడంలో సుందరం మాఁవయ్యే పాపారావుగారికి అయిదువేలదాకా యివ్వాలని తేలింది. కాని మాఁవయ్య యిచ్చేస్థితిలో ఉన్నాడా? కాని కాలం—ఘోరకలి—యిద్దరి నెత్తినా ఒక్కలాగే పెట్టింది శఠగోపం. వారం తిరగకుండా సుందరం మాఁవయ్య మంచం పట్టాడు. నాలుగోనాటికి హరీమన్నాడు. పాపారావుగారికి, యిది గోరుచుట్టుమీద రోకటిపోటు! తన మాటకేం? ఒంటిగాడు. ఎలాగయినా వెళిపోతుంది. కాని సుందరం భార్యాపిల్లలూ మాటో? ఉన్నది కాస్తా అప్పులవాళ్లు పేలేసుకుపోతే, యిహ వాళ్లు తినేదేముంది? బతికేదెలాగ? ఇంట్లో చూస్తే దిమ్మిడీల్లాగ బొత్తిగా చిన్నపిల్లలూ, ఆడవాళ్లున్నూ.

ఒకచెంప వొళ్లమాలిన దెబ్బతిని, అటు అప్పుల పాలయిపోయి, యిటు అన్నదమ్ముడు లాంటివాణ్ణి పోగొట్టుకుని—అతనికి పిచ్చెత్తినట్టు అయిపోయింది. ఉన్నకాడికి ఆస్తీ పాస్తీ తెగనమ్మి, అప్పులు తనవీ, మాఁవయ్యవీ పూర్తిగా తీర్చుకుని ఆ ఊరినుంచి బిచాణా యెత్తేశాడు. పోయిన తన ప్రాణమిత్రుడికి ఏ అప్రతిష్ఠా రాకుండా ఉండాలని తను చేసిన వ్యవహారం సంగతి యింట్లో యెవ్వరితోనూ బెసగలేదు, పాపారావుగారు.

## 4

అందాకా కుడీయెడమూ కానకుండా ఖర్చుచేసే అతనికి అరాత్తుగా ఊర్జితంగా కాలక్షేపం చెయ్యాలంటే ఏఁవీదారీ తెన్నూ కనపళ్లేదు. చేతులో మిగిలిన వల్లా ఏవందో, రెండువందలోను. రోజుకి రోజూ అవీ హారతి కర్పూరంలాగ హరించుకు పోతున్నాయి. తన పూర్వపు స్నేహితుల్ని యెవరిని కలుసుకున్నా అతనికి ఆమాత్రం పుట్టకపోయేది కాదు. కాని ఆత్మాభిమానం అడ్డు తగిలింది; యెప్పుడూ పిడికిలిపట్టే ఉండవలసిన చెయ్యి, యిప్పుడు "దేహి" అనిపించడానికి అతని మనస్సు వొప్పిందికాదు.

సిగరెట్టు కాల్చుకోకుండా జీవితం యేఁవిటనీ, కోటులేకుండా బయటికి ఎలాగ వెళ్లడం అనీ అనుకునే ఆ ఆసామీ, ఖద్దగులాల్చీ ముతక పంచె కట్టుకుని చెప్పులయినా లేకుండా తిరగడం అలవాటు చేసుకునేసరికి బాఘా ఏడాది పట్టింది. ఇంకా అతనిదగ్గిర మిగిలిన పూర్వస్మృతి చిహ్నాలు ఓ క్షీరాబ్ధి పట్టు పంచా, దానిజత ఉత్తరీయమున్నూ.

ఇన్నాళ్ళూ అతను తనకితానే మిగిలిపోయాడు. పేదరికం ఓ పెద్ద జబ్బు. మనిషి ఆదినుంచీ పేదరికపు పెంపుడుబిడ్డ అయితేతప్ప లేకపోతే యీ జబ్బు

పాదమాపేసరికి సంఘం దవ్వుదవ్వులకి తొలిగిపోతుంది. ఇంకా ఆ మనిషిమాటా? అతను కాస్త సున్నితహృదయుడైతే లోలోపలే క్రుంగిపోతాడు; అలా క్రుంగిపోతూనే తెలుసుకుంటాడు, అందాకా తనవెంట తిరుగుతూ ఆప్యాయంగా వుంటూన్నవాళ్లే తనని యెంత త్వరగా మరిచిపోతారోనని!

ఆ కర్మాగారంలో తనలాంటివాళ్లు ఒకరిద్దరు లేకపోలేదు. ఎకౌంట్సు సరిచూస్తూనో, గాంగు కూలీలపని తనిఖీ చేస్తూనో, వాళ్లూ తానూ తారసపడినప్పుడు అకస్మాత్తుగా ఎందుకో కళ్లు మెరిసేవి. హృదయాలు స్పందించేవి. అయితే యెవరిపని వాళ్లు చూసుకుంటూ ముక్తసరిగానే దాటుకుపోయేవాళ్లు. అంతకన్నా లోతుగా ఒకర్ని ఒకరు తెలుసుకోవడానికి మనసు వొప్పేది కాదు. అహంకారఁవో, ఆత్మగౌరవఁవో అడ్డుతగిలేవి. ధైర్యం చాలేదికాదు. కాని యెంతకాలం అలా కాలం వెళ్లబుచ్చగలరూ? తమకి తెలియకుండానే మాటలు యేవో పూర్వస్మృతిపథాలని అనుగమించేవి. ఆ తరవాయి ఎక్కడ యెవరి జీవితంలో చూద్దాం అన్నా లోకంలో అమానుషత్వఁవే తెలిసొచ్చేది.

అలాంటి పరిస్థితుల్లో మనిషికి వింతగా గోచరిస్తుంది జ్ఞానం. క్లుప్తంగా కాలక్షేపం చెయ్యడం నేర్చుకుంటూ——అలవరుచుకుంటూ——బతకడానికి అసలు ఆర్జన అనేదే అవసరంలేదని గ్రహిస్తాడు. బ్రష్షూ పేస్టూ వాడితేనేగాని పళ్ళు శుభ్రంగా ఉండవని దృఢంగా నమ్మిన అతనికి కాసు పుల్ల యెంతెలా కళ్ళు విప్పిందీ! ఉదయాన్నే కాఫీ, పది గంటలకి భోజనం, మధ్యాహ్నం ఫలహారం, రాత్రి భోజనానంతరం మళ్ళీ పాలూ——యివన్నీ అరగక జబ్బులూ——వాటినుంచి కోలుకోడానికి మందులూ, టానిక్కులూ——అబ్బ! అదంతా ఓ తతంగం! రాత్రిళ్ళు రేడియో వింటేనేగాని నిద్రపట్టక గంగ వెర్రులెత్తిపోయే తనకి, చాప పరుచుకుని నడుం వాల్చడఁవే తడువుకాదూ యీ రోజుల్లోనూ? ఛీ! వెధవలాలసత!

ఆదిలో అలా తనలో తానే ఉపన్యాసాలు చెప్పుకున్నాడు, పాపారావుగారు. పాపం, ఆయన్ని అపార్థం చేసుకోకండి. అదంతా "అభావే విరక్తిః" కాదు. ఆయన ఆత్మాభిమానం చాలా గట్టిదెబ్బతింది. అవమానంతో కుంగిపోయి మూలమూలల మూలుగుతోంది ఆ ఆత్మ. ఆత్మాభిమానం కొఱతపడడం యెంత లోపం! ఆ లోపం పూడుస్తాయి, యీ ఉపన్యాసాలు. ఆయనకి అంతకంటె మోక్షం లేదు!

## 5

పరిస్థితులు యిలా ఉంటూంటే కార్మిక వర్గానికి యేదో పండుగ వచ్చింది. మే ఒకటో తేదీ కాబోలు. అంతా చందాలూ అవీ పోగుచేసి, యేదో ఆర్భాటం చేస్తున్నారు. అల్లుల్లో మల్లుడు పెద్దవాడని వాళ్లకందరికీ పాపారావుగారు పెద్ద అయిపోయాడు. సాయంత్రం మీటింగుకి యిసకవేస్తే రాలకుండా ప్రజ! గరివిడి, గర్భాం, నెల్లిమర్లనుంచి కూడా కార్మికులు బళ్ళు చేసుకుని మరీ వొచ్చారు. పాపారావుగారు బ్రహ్మాండంగా ఉపన్యసించేరని మర్నాడు పేపర్లు ఘోషించాయి.

ఆ ఉపన్యాసం "బాజీ" కొడుకు వాళ్లఅమ్మకీ, అమ్మమ్మకీ చదివి వినిపించాడు. ఆ ఉపన్యాసానికి తనూ వెళ్లానన్నాడు. పాపారావుగారిని ఆకాశం యెత్తున పొగిడేశాడు. కామాక్షత్తయ్య అమాంతం కొంపె అంటుకుంది. కేవలం ఒక తల్లికడుపున పుట్టినట్టు మెలుగుకునే తన భర్త గతించడంతోనే పట్టరాని వ్యాకులత పొంది, పాపారావుగారిటు సంఘసేవకీ మానవ కల్యాణానికీ పూనుకున్నాడని నిశ్చయం చేసుకుంది. "అవును మరి. అతనికేం డబ్బులేదా? చదువు లేదా? ఉన్న యిల్లూ వాకిలీ ఒఖ్ఖ దెబ్బని అమ్మి పారేశాడు, డెబ్భయివేలకి గాబోలు; అక్కడికి యింకా నష్టానికే అమ్మేశాడు. ఏదయితే నేం? కావాలంటే కాలుమీద కాలువేసుకు కూర్చుని తినలేడూ? అసలు అతని రస్తాయే వేరు. నే నెరగనా యేమిటి? ఎప్పుడూ బాజీకి ఏవో ఒకటి అలాకొని యిస్తూనే ఉండేవాడు. తరవాత తరవాత బాబిగాడి చదువో? ఒక్క బాబిగాడే యేమిటి? కాలేజీలో పిల్లలు యెంతమంది పాఠాలు చెప్పుకునేవారు కారు! ఎన్నడయినా ఒక గడ్డిపోచ ఆశించాడూ? పోనీ, బుద్ధి ఉన్నందుకు కీర్తిమంతుడైనాడు, ఆయన బతికే ఉంటే యెంత ఆనందపడుదురో! చూసుకోడానికి అదృష్టం లేకపోయింది," అనుకుంటూ కామాక్షత్త కంటనీరు పెట్టుకుంది. తామింకా భీముని పట్నంలో వేసంగి ఆఖరుదాకా ఉంటాం అనీ, తప్పకుండా ఓసారి చూసిపోవలసిందనీ కబురెట్టింది, అత్త, పాపారావుగారికి.

మాట కాదనలేక ఆయన వొచ్చాడు, పాపం. తిరిగీ క్రిస్మస్ సెలవల్లో రమ్మని బాజీ బలవంతపెట్టే

సరికి అతనికి పచ్చి వెలగకాయ గొంతుకపడ్డట్టయింది. ఇంకేమీ అనడానికి తోచక, సంఘం—పనులూ ఆ చిక్కుల్లో ఉన్నాననేశాడు. "సంఘం అంటేఆనాటి మీటింగు అదీ అనుకుంటారని ఆయన ఉద్దేశం. యిక్కడ వీళ్ళు కేవలం మానవ సంఘానికే ఏదో తాను మహదుద్ధరణ చేసేస్తున్నాడని అన్వయం చేసుకున్నారు. పాపారావుగారి ఆత్మత్యాగానికీ, సౌమనస్యానికీ వాళ్ళ హృదయాలు ఉప్పొంగిపోయాయి. ఆ హృదయ కుహరాల్లోనే నతులు సమర్పించేరు ఆ పుణ్యమూర్తికి!

'ఆషాఢస్య ప్రథమదివసే' తొలకరించింది. భూమి చల్లపడిందికదా అని అత్తా, బాజీ, పిల్లలూ భీముని పట్నం మకాం యెత్తేసి వెళ్ళిపోయారు. మరి నాలుగు రోజులకి పాపారావుగారికి ఓ ఉత్తరం వొచ్చింది -

"బాబాయికి నమస్తే—

లోగడ భీముని పట్నంలో నిన్ను కలుసుకుని మాట్లాడిన తరవాతా, నీ జీవితం వైఖరీ చూసీ మేం అంతా యెంతో ఆశ్చర్యపడ్డాం. నీలాగ సంఘానికి తోడుపడే అవకాశం యెంతమందికి దొరుకుతుంది చెప్పు బాబాయ్? అవకాశాలు ఉన్నా, తన సుఖం కూడా కాదని, వాటిని సద్వినియోగం చేసుకునేవాళ్ళెంతమంది? నాలాంటి వాళ్ళం ఉన్నాం, ఏం లాభం? మా పొట్ట మాకు శ్రీరామరక్ష. ఇవన్నీ నేను ఒక్కర్తెనే అంటూన్న మాటలు కాదు. మా వారూ, అమ్మా కూడా యిలాగే అనుకుంటున్నారు. మావారయితే నువ్వు చేస్తూన్న పని ఎంతో మెచ్చుకుంటున్నాం అని మరీ మరీ రాయమన్నారు. అంతే కాదు; యిందుతో రూ 1116/- కి చెక్కు జతపరుస్తున్నాం. ఈ డబ్బు మీ సంఘంలో తగిన కుటుంబం చూసి, వారి సంరక్షణకి ఖర్చుపెట్టు. నీకు సంఘం పని తొందర్లు ఉంటే క్రిస్‌మస్‌కి యిక్కడికి వచ్చి నీ పని పాడుచేసుకోకు. వీలు చూసుకుని నాలుగు రోజులు సెలవు పెట్టి పండుగరోజుల్లో మేమే వొచ్చి కలుసుకుంటాం. అప్పుడు నీకు ఒబ్బట్లు చేసి పెడతాన్లే!

మరి,
అందాకా ఉండనా?
నీ
బాజీ.

## 6

చెక్కు చేత్తో పట్టుకుని దిగాలుపడి చూస్తున్నాడు పాపారావుగారు. అలాంటివి లక్ష చెక్కులు తనూ యిచ్చేడు; కాని ప్రస్తుత పరిస్థితుల్లో ఆ మొత్తం పెన్నిధే తనకి. వెయ్యినూట పదహార్లు! ఎంత సొమ్ము!! అందులో సగం ఉంటే యెన్నో పనులు చెయ్యొచ్చును. తనకి రెండంటే రెండేగా ఉన్న లాల్చీలు! ఆ చిరిగిన ధోవతికి మరి మాసిక వేయించనక్కరలేదు. తన తిరుగుడికి అన్నింటికంటే ముఖ్యావసరం ఓ గొడుగు. తనది అసలు ఏ వొస్తువ మరామ్మత్తుకి రాకుండా ఉంది?

చెక్కు కేసి మళ్ళీ చూసేడు, పాపారావుగారు. అది క్రాసు చెక్కు. మొట్టమొదటిసారిగా తనికి తట్టింది క్రాసుచేసిన చెక్కు మార్చుకోవాలంటే ఎన్ని తికమకలు పడాలో అని! దీర్ఘంగా నిట్టూర్చాడు.

సరే, ఏదయితేనేం. ఉత్తరానికి వెంటనే జవాబు రాయాలి. ఇల్లంతా గాలించి ఓ పావుటావు కాగితం ముక్క, కలం సిరాబుడ్డీ పట్టుకొచ్చాడు. కాని ఏమి రాయడానికీ పాలుపోయింది కాదు. ఎట్టకేలకు మొదలెట్టాడు—

"బాజీకి, బాబాయ్ ఆశీర్వచనాలు.

నువ్వు అపారార్ద్రహృదయంతో రాసిన ఉత్తరం, కూడా పంపిన చెక్కు చేరాయి. నా కృతజ్ఞత స్వీకరించు. నువ్వు కోరినట్టుగా యీసొమ్ము—"

ఏవిటో వెధవది, కంపెనీ ఉత్తరంలాగ తయారయింది, ఆఖరికి. మాటమాటకీ తడుముళ్ళాడుకోడవే. ఏ మాటా పొందికగా కుదరకుండా ఉంది.

ఉత్తరం రాయడం ఎన్నడూ అతనికి అంత కష్టంగా తోచలేదు. కాగితం చింపి అవతల పారేశాడు.

ఆ రాత్రి అతనికి నిద్ర పట్టినట్టూ కాదు; పట్టనట్టూ కాదు. తనమట్టుకు తనకే ఆశ్చర్యం వేసింది, నిజంగా ఆ సొమ్ము పుచ్చుకోడానికి యెవరు తగుదురా అని. అసలు విషయం ఆలోచిస్తే బాజీ యెటువంటి వ్యక్తులని ఉద్దేశించి ఆ సొమ్ము వినియోగించమందో తనకి తెలియడంలేదు. బహుశా తనకి అటువంటివాళ్లు తారసపళ్ళేదేమో! ఒవిధంగా చూస్తే అంతమందీ బీదవాళ్ళే మరీ—కాని, పేదరికం అందరిపట్లా ఒక్కలాగే అన్వయిస్తుందా అన్నది ప్రశ్న. ఏ ఆస్కారం లేకుండా చెట్టుమీది పిట్టకన్నా కనికష్టంగా-అఘోరిస్తూన్నవాళ్ళెంతమంది? తనతో పోల్చిచూస్తే తనచుట్టుపక్కల ఉండేవాళ్ళు పేదవాళ్ళా? పెద్దింటివాడూ, చదువుకున్నవాడూ, పరిస్థితుల ఒత్తిడి మూలాన్న

సామాన్యుల మధ్యని పడేసరికి, రకరకాల భావాలు పుట్టుకొస్తాయి. గత యేడాదినుంచీ పాపారావుగారికి అలాంటిదే ఒక నిశ్చితాభిప్రాయం—సామాన్య జీవితంలో ఉండే కష్టాలు సర్వసాధారణంగా గోరంతలు కొండంతలు చేసి చెబుతారనీ, వాళ్లకి వర్తించని కొలతబద్దతో సామాన్యుల జీవితం తైపారు చేస్తారనీ, అంచేతే ఆ కష్టాలు యెంతో యిదిగా అవుపిస్తాయి అనిన్నీ. తన చుట్టూ యెక్కడచూసినా, ఆ మెకానిక్కూ యీ ఫిట్టరూ, ఆ ఫోర్మనూ, యీ ఛార్జిమేనూ, కుమ్మరీ, కమ్మరీ—ఎవరింట్లో వాళ్ళు హాయిగా నిద్రపోతున్నారు. తాగి తందనాలే ఆడుదురుగాక; పేకాటల్లో ఓడిపోయి కత్తులు పెంచుకుని కొట్టుకుందురుగాక; పశుత్వానికి లొంగిపోయి ఒకరి ఆలిని యింకొకరు లేవదీసుకునే పోదురుగాక. కాని, వాళ్ళు ఓ ముద్ద తిని ఓ పంచని పడుంటున్నారు. నిర్భాగ్యులు అంటారా? కాని తనది బొత్తిగా దౌర్భాగ్యం కాదూ?

అంతలో యింకో ఆలోచన తట్టింది. పెద్ద కుటుంబంలోంచి వొచ్చిన మనిషి గనక, బాజీ అలా మర్యాదగా రాసిందికాని, తన వేషంచూసి సంగతంతా గ్రహించిందేమో? కొంపదీసి తనకోసమే పంపిందేమో ఆ సొమ్ము? అలాగే అయిఉంటుంది. అసలు వాళ్లనాన్న తనకి బాకీ ఉన్నదాంట్లో యిది సగం అయినా లేదే?

ఛీ ఛీ, పాడు ఆలోచనలు. అంతా సుఖంగా ఉన్నారూ? తనొక్కడేనా దుఃఖంలో ఉంట! వీళ్లకి యిక్కడ ఓ ఆసుపత్రయినా వుందీ? పురుళ్లు పొయ్యడానికి సరయిన ఓ మంతరసానయినా ఏడిసిందీ ఆఖరికి? ఫేక్టరీలో ఎవరికయినా కాలూ చెయ్యా తెగితే—అబ్బ! యింక తలుచుకోడానికి గూడా శక్తి చాలలేదు అతనికి. అభాజనపు బుద్ధులు పుట్టినందుకు తనని తనే వెయ్యివిధాల నిందించుకున్నాడు.

అంతలో కోడి కూసింది. ఏటికివెళ్ళి కాలకృత్యాలు తీర్చుకుని స్నానంచేసి వొచ్చేడు— ఉత్తరం తిరిగీ ఆరంభించేడు—

"బాజీ,

నువ్వు రాసిన ఉత్తరం చూసుకున్నాను; చెక్కూ అందుకున్నాను. కాని, యింకముందెప్పుడూ యిలాంటి పనిమాత్రం నానెత్తిని పెట్టకేం? నానాటికీ ఏవిటో ఏ పనీ చెయ్యలేకుండా వున్నాను. అసలు యీ సొమ్మే ఏం చెయ్యడవా అని పరిపరి విధాల ఆలోచించి, చివరికి "సంఘం" ట్రెజరరుకి యిచ్చేసేను, సవ్యంగా ఉపయోగించమని. దాని మింజుమలె ఖర్చు వెచ్చాల వివరాలు ఆయన నీకు రాస్తాడు.

తగినవాళ్లకి స్వయంగా యివ్వకుండా యింకొకరి చేతులో పెట్టేనేమా అని ఆశ్చర్యపోకు. ఈమధ్య నాకీ ఊరు నీళ్ళు ఏమీ పడడంలేదు. త్వరలో యిక్కడనుంచి మకాం యెత్తేస్తున్నాను.

ఏలూరు వెళ్ళిపోతున్నానా అనుకుంటున్నావు కదూ, బాజీ? నాకే తెలియదు. ఈపాటున నన్ను మరిచిపో, బాజీ; మీరంతా యింక నన్ను మరిచిపొండి. అలా మరిచిపోతారనే నమ్మకంతో—

నీ

బాబాయ్.

## 7

"మీ పాపారావు బాబాయ్‌గా ర్రాసేరే" అంటూ చదవడానికి ఆరంభించేడు బాజీ భర్త ఆ ఉత్తరం.

కూడా ఉన్న స్నేహితుడికి టీ కలిపియిస్తూ, నవ్వుమొహంతో చెవులు రెండూ భర్తకి అప్పజెప్పి వింటోంది, బాజీ.

"కొంపదీసి ఆ చెక్కు కాస్తా చేతబుచ్చుకు ఉడాయించ లేదుగదా, యీ దేశోద్ధారకుడు?" ఛప్పున నోరుజారేడు, అంతా విన్న ఆ స్నేహితుడు.

భర్త చేతులోంచి అప్రయత్నంగా ఉత్తరం నేలకి జారిపోయింది.

పైట చెరగుతో ముఖం కప్పుకుని బాజీ బైటకి పోయింది.